క్లుప్తంగా

వాసుపల్లిని కలిసిన మారుతీప్రసాద్



మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఆ పార్టీ నాయకుడు వంకాయల మారుతీప్రసాద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. వాసుపల్లిని పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, అప్పన్న అప్పారావు, శ్యామ్ తదితరులు కలిశారు.
– డాబాగార్డెన్స్

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి కూలీల మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయ్‌కుమార్

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేటలో ఉపాధి హామి పథకం పనులను ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. కూలీల మస్తర్లు (హాజరు)ను పరిశీలించి, వారికి పలు సూచనలు చేశారు.

అచేతనంగా ఉన్న కాకి మృతి



మృతి చెందిన కాకి

తగరపువలస: భీమిలి చుట్టుపక్కల ప్రాంతాల్లో కాకుల మృత్యుఘోష ఆగడం లేదు. సంతపేటలో మంగళవారం సాయంత్రం పై నుంచి పడి, అచేతనంగా ఉన్న కాకి బుధవారం ఉదయం మృతి చెందింది. తరచూ కాకులు విచిత్రంగా మృతి చెందుతున్న విషయాన్ని పశు సంవర్ధకశాఖ భీమిలి సహాయ సంచాలకుడు డాక్టర్ బి.వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన మొదట ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇటీవల భీమిలి–విశాఖ బీచ్ ప్రాంతంలో తరచూ చేపలు, తాబేళ్లు మృతి చెందుతున్న విషయాన్ని గుర్తు చేశారు. విష ప్రయోగం, కాలుష్య కారణాలతో చనిపోయిన తాబేళ్లు, చేపలను తినడం వలన కాకులు మృతి చెంది ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇకపై ఎక్కడైనా ఇలా కాకులు, పక్షులు అనుమానాస్పదంగా మృతి చెందితే, వాటి కళేబరాలు లేదా రక్త నమూనాలను భీమిలి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌కు అనుబంధంగా ఉన్న వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలో పరీక్షిస్తామని తెలిపారు. పరీక్షల అనంతరం వాటి మృతికి కారణాలు తెలుసుకోవచ్చన్నారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలసలో శ్రీసీతారామాలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. శ్రీరామాద్రి ఆలయ అభివృద్ధి సంక్షేమ సంఘం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీతారాములకు అభిషేకాలు, కుంకుమ పూజలు, అన్నసమారాధన, పల్లకిసేవ నిర్వహించారు. సాయంత్రం రామకృష్ణానంద శ్రీమద్రామాయణం ప్రవచనాలు ఆకట్టుకున్నాయి.

సింహగిరిపై శ్రీనృసింహ హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి వైభవంగా చేశారు. కుంభప్రోక్షణను శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

మాఘమాసం.. శుభకార్యాలకు అనువైన సమయం. అయితే జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో సామాన్యులకు అందుబాటులో కల్యాణమండపాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. తగరపువలస, చిట్టివలస, సంగివలస డివిజన్ల పరిధిలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఈ మూడు డివిజన్లలో సుమారు 75వేల వరకు జనాభా ఉన్నారు. ఇంతమందికి సీజన్‌లో సుమారు 10 నుంచి 15 కల్యాణమండపాలు అవసరం. కానీ ఈ ప్రాంతాల్లో జీవీఎంసీకి సంబంధించిన సరైన మండపాలు మూడు కూడా లేవు. 12 వరకు ప్రైవేట్ మండపాలు ఉన్నా వాటి అద్దెలు **మధ్యతరగతి వారికి అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు.**

కల్యాణ మండపాలు కావలెను


- **రోడ్లపైనే పెళ్లిళ్లు, ఫంక్షన్లు**
- సామాన్యులకు భారంగా ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లు
- అనువైన స్థలాలున్నా నిర్మించని జీవీఎంసీ
- లక్షల్లో అద్దెలు.. భారీగా ప్యాకేజీలు



కల్యాణమండపాలు అందుబాటులో లేక ఖాళీ ప్రదేశాల్లో టెంట్లు వేసుకుని నిర్వహిస్తున్న ఫంక్షన్లు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో **సామాన్య, మధ్య తర**గతి ప్రజలను కల్యాణ మం**డపాలు, ఫంక్షన్ హాళ్ల** కొరత తీవ్రంగా వేధిస్తోంది. **కల్యాణ మండప**ాల నిర్మాణానికి అనువైన **ఖాళీ స్థలాలు ఉన్నా** ఒక్కటంటే ఒక్కటి కూడా జీవీఎంసీ నిర్మించకపోవడం, ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల అద్దెలు రూ.లక్షల్లో ఉండటం ప్రధాన సామాజిక సమస్యగా మారింది. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లు ఊరికి దూరంగా ఉండటంతో పాటు ప్యాకేజీల పేరుతో ఫొటోగ్రఫీ, బ్యాండ్, లైటింగ్, కేటరింగ్, మండపాల అలంకరణ ఖర్చులన్నీ స్థోమతకు మించి అందుబాటులో లేకుండా పోతున్నాయి. దీంతో అనధికారంగా రోడ్లను బ్లాక్ చేసి లేదా ప్రైవేట్‌వ్యక్తుల చేతుల్లో ఉన్న ఖాళీ స్థలాలలో పెళ్లిళ్లు, పెద్దకర్మలు, ఓణీ ఫంక్షన్లు, విందు భోజనాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. రోడ్లను బ్లాక్ చేయడం వలన మిగిలిన వారి రాకపోకలకు పెద్ద సమస్యగా తయారయింది. గతంలో చిట్టివలస జ్యూట్‌మిల్లుకు సంబంధించి కల్యాణ మండపం, లేబర్ వెల్ఫేర్ సెంటర్, బంతాట మైదానాలలో తక్కువ ఖర్చుతో ఫంక్షన్లు జరిపించుకున్నా, ప్రస్తుతం వీటి నిర్వహణ నిలిపివేసిన కారణంగా ప్రత్యామ్నాయం లేకుండా పోయింది.

అసంపూర్తి భవనాలు.. ఖాళీ స్థలాలు



వుడా వాణిజ్య సముదాయం కూల్చిన చోట ఖాళీ స్థలం

- టీడీపీ హయాంలో సంతపేట ఎన్టీఆర్ కల్యాణ మండపాన్ని కూల్చి, కొత్తది నిర్మిస్తామని చెప్పినా సాకారం కాలేదు.
- రెడ్డివీధి రామాలయంలో కల్యాణమండపాన్ని టీడీపీ హయాంలోనే అసంపూర్తిగా నిర్మించారు.
- హరిజన సంతపేటలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనంలో ఒక హాలు సామాజిక భవనానికి కేటాయిస్తామని జీవీఎంసీ మాట మార్చింది.
- గతంలో గ్రంథాలయ వీధిలో కూల్చివేసిన భారీ వుడా వాణిజ్య సముదాయం ప్రస్తుతం ఖాళీగా ఉంది. అక్కడ అన్ని వసతులతో కల్యాణమండపం నిర్మిస్తే చిట్టివలస, తగరపువలస, సంగివలస వాసులకు అనువుగా ఉంటుంది.
- **బంగ్లామెట్టపై పురాతన బంగ్లా ఆక్రమణదా**రుల చేతుల్లో ఉంది. దీనిని కూల్చి కల్యాణ మండపం కట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మాణాలు..వసతులు

- ఒకటోవార్డు బంగ్లామెట్ట షాదీఖానాను వైఎస్సార్‌సీపీ హయాంలో ఆధునికీకరించారు. ఇక్కడ 30 ఏళ్ల క్రితం టీడీపీ హయాంలో ముస్లింల కోసం నిర్మించిన షాదీఖానాలో వసతులు లేకపోవడంతో ప్రారంభం కాకుండానే శిథిలం అయిపోయింది. తరువాత పలుమార్లు టీడీపీ అధికారంలోకి వచ్చినా ముస్లింల గోడు పట్టించుకోలేదు. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.48.70 లక్షలతో వసతులు కల్పించారు.
- డెక్కతిపాలెంలో రూ.40 లక్షలతో సామాజిక భవనం, సంతపేటలో రూ.35 లక్షలు, చిట్టివలసలో రూ.42 లక్షలు, గ్రంథాలయ వీధిలో రూ.28 లక్షలతో సామాజిక భవనాలకు వసతులు, అదనపు గదుల నిర్మాణాలు వైఎస్సార్‌సీపీ హయాంలోనే జరిగాయి.



చిట్టివలసలో రూ.42 లక్షలతో వసతులు కల్పించిన సామాజిక భవనం

జనాభాకు తగినట్టు మండపాలు నిర్మించాలి



భీమిలి జోన్‌లో తగరపువలస, చిట్టివలస, సంగివలస డివిజన్‌లలో జనాభా విపరీతంగా పెరిగిపోతుంది. ఈ జనాభాకు తగినట్టుగా కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు లేవు. ఆ దిశగా కార్పొరేటర్లు ప్రయత్నించాలి. – **తమ్మిన రాజు**, తగరపువలస

రోడ్లపై ఫంక్షన్లు ఇబ్బందికరంగా



కల్యాణ మండపాలు లేక చాలాసార్లు సామాన్య, మధ్య తరగతి ప్రజలు రహదారులను మూసివేసి టెంట్లు, మండపాలు వేస్తున్నారు. దీంతో మిగిలిన వారి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. ప్రతి గ్రామానికి కల్యాణ మండపం అవసరం.

– **కుంచా శివరామకృష్ణ**, చిట్టివలస

భారంగా ప్రైవేట్ మండపాలు



ప్రైవేట్ మండపాలలో ప్యాకేజీలతో కూడిన అద్దెలు సామాన్యులు భరించలేనంత భారంగా ఉంటున్నాయి. డెకరేషన్, బ్యాండ్ మేళం, ఫొటోగ్రఫీ, కేటరింగ్ వారి వద్ద తీసుకోవాలని మండప యజమానులు షరతులు పెడుతున్నారు. దీంతో బడ్జెట్ అదుపు తప్పుతుంది. – **గంట్రేటి ఈశ్వరరావు**, కొండపేట

చిల్లపేటలో పశువైద్య శిబిరం నేడు



జీరుపేటలో ఆవుదూడకు చికిత్స అందిస్తున్న పశు వైద్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ చిల్లపేట, జీరుపేట జంట గ్రామాల్లో గురువారం ఉదయం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ బి.వెంకటరమణ తెలిపారు. 'మరో దూడకూ లంపీ స్కిన్ వ్యాధి' శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. జీరుపేటలోని కొల్లి సూర్రెడ్డి పశువుల దొడ్డికి సిబ్బందితో వెళ్లి దూడను పరీక్షించి, విచారణ చేపట్టారు. లంపీస్కిన్ వ్యాధిగా నిర్ధారిస్తూ ఐదు రోజుల పాటు చికిత్సకు మందులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పశు వైద్యశాలల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. పాడిరైతులు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ల అందజేత



క్రీడాకారులకు బ్యాడ్మింటన్ కిట్లు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ పరిధిలో క్రీడాకారులకు శ్రీనివాస యువజన సేవా సంఘం వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ కిట్లు అందజేసింది. సంఘం అధ్యక్షుడు కోన సన్యాసినాయుడు, కార్యదర్శి పద్మనాభ స్వామి వీటిని బుధవారం క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో యువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు వీటిని అందించామన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి మజ్జి శంకరరావు, సహాయ కార్యదర్శి కంది సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పతివాడ ఇంద్రరావు, సభ్యుడు బర్ల మధు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఉత్సవ కమిటీ ఎన్నిక



ఎన్నికైన ఉత్సవ కమిటీ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా అల్లిపిల్లి వేణుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమ్మవారి ఆలయం వద్ద బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శిగా యచ్చర్ల హరి, కోశాధికారిగా పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, కార్య నిర్వాహక కార్యదర్శిగా పాశి వినోద్‌కుమార్, కో–ఆర్డినేటర్‌గా గొరపల్లి సన్యాసిరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

28న అనుపు ఉత్సవం

అమ్మవారి తొలేళ్ల ఉత్సవం మార్చి 27వ తేదీన నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి గంటస్తంభం వేదిక వద్ద బాణసంచా కాల్చడం, బళ్లవేషాలు, ఊరేగింపులు ఉంటాయి. 28న అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఆరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. పెద్దబజారు, ఎగువపేట వేదికల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. 29, 30 తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం 11 కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా అన్నవరం, కంచేరుపాలెం, పెదనాగమయ్యపాలెం, చిన నాగమయ్యపాలెం, ఆశిపాలెం, ఎర్రయ్యపాలెం, ఎన్టీఆర్ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పీఎం పాలెం సబ్‌స్టేషన్ పరిధిలో..

మధురవాడ: పీఎం పాలెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సంబంధిత ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈఈ ఎం.అప్పలనాయుడు తెలిపారు. ఈ కారణంగా జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, ఏఎస్ఆర్ లేఅవుట్, తులసి నగర్, లక్ష్మివానిపాలెం, గాయత్రి లేఅవుట్, ఏపీహెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చిట్టివలస సబ్‌స్టేషన్ పరిధిలో..

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ తాళ్లవలస, 11 కేవీ సంగివలస ఫీడర్లలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కారణంగా రాజుల తాళ్లవలస, తిరుమల కళాశాల, యాతపేట, చిన్నిపేట, ఎస్ఆర్ఐ ఆస్పత్రి డబుల్ రోడ్డు, అనిట్స్ కళాశాల రోడ్డు, ఉప్పులపేట, సంగివలస, ఇడదాసరిపేట, నమ్మివానిపేట, వలందపేట, చిల్లపేట, సుఖీభవ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మధురవాడ సబ్‌స్టేషన్ పరిధిలో..

పీఎం పాలెం: మధురవాడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ దిగువ పేర్కొన్న ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషన్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడ శివశక్తినగర్ , సద్గురు సాయిరామ్ కాలనీ, గణేష్ నగర్, శ్రీ లక్ష్మీనగర్, అయ్యప్పనగర్, ముత్యాలమ్మ కాలనీ, స్వయంకృషి నగర్, వైఎస్సార్ కాలనీ ఏరియాలలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మరోమారు రెచ్చిపోయిన ఆకతాయిలు

- చిల్డ్రన్స్ పార్కులో కొట్లాట



ఆకతాయిని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంతపేట చిల్డ్రన్స్ పార్కులో బుధవారం సాయంత్రం మరోమారు ఆకతాయిలు రెచ్చిపోయారు. మద్యం, మత్తు పదార్థాల మత్తులో పదుల సంఖ్యలో యువకులు కొట్లాటకు దిగారు. అసభ్యకరమైన పదజాలంతో దూషణలకు దిగి, పెద్దగా కేకలు వేసుకుని తోసుకున్నారు. గొల్లవీధిని ఆనుకుని దారిన పోయేవారిపై అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో స్థానికులు జోక్యం చేసుకుని భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకునేలోగా వారు జారుకున్నారు. దీంతో అక్కడే ఉన్న ఓ యువకుడిని పోలీసులకు అప్పగించారు. గతంలోనూ ఒకసారి ఇలాగే జరగడంతో ఆందోళన చెందుతున్నారు.

నిత్యం ఇదే తంతు

పార్కులో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను అడ్డాగా చేసుకుని నిత్యం పదుల సంఖ్యలో ఆకతాయిలు చీకటి పడే వేళకు ఇక్కడికి చేరుకుంటున్నారు. మద్యంతో పాటు గంజాయి, మత్తు కలిగించే గమ్‌లను పీల్చడం.. మద్యం సీసాలతో కొట్టుకుంటూ స్కూల్, అంగన్‌వాడీ, జిమ్, షటిల్ కోర్టు ఆవరణలో గాజు పెంకులు చల్లడం వంటి పనులు చేస్తున్నారు. చుట్టు పక్కల ఇళ్ల తలుపులు బాదడం, ఆస్తులకు నష్టం కలిగించడం, అర్ధరాత్రి దాటే వరకు పార్కులో మకాం వేసి భయాందోళనలకు గురి చేయడం, సెకండ్ షో సినిమా నుంచి వచ్చేవారిని పరుగులు తీయించడం వంటివి చేస్తున్నారు. వీరికి పార్కు చుట్టూ ఉండే మరికొందరు ఆకతాయిలు సహకారం అందిస్తుండటంతో మరింత రెచ్చిపోతున్నారు. పగటివేళ కూడా పార్కు బయట తిష్టవేసి అటుగా వెళ్లేవారిని వేధిస్తున్నారు. దీంతో హడలిపోతున్న సంతపేట గొల్లవీధి, రెడ్డివీధి, కుమ్మరివీధి ప్రజలు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భీమిలి పోలీసులను కోరుతున్నారు.

కుటుంబసభ్యుల చెంతకు వృద్ధుడు



వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పీఎం పాలెం పోలీసులు

పీఎం పాలెం: కొద్ది రోజులుగా స్థానిక ఉజ్వల హాస్పిటల్ ఏరియాలో తిరుగుతున్న వృద్ధుడిని పీఎం పాలెం పోలీసులు కుటుంబీకులకు అప్పగించారు. వివరాలివి.. మతిస్థిమితం లేని వృద్ధుడు ఆస్పత్రి వద్ద తిరగడంతో గుర్తించిన స్థానికులు పీఎం పాలెం పోలీసులకు బుధవారం సమాచారమిచ్చారు. వృద్ధుడిని చేరదీసిన పోలీసులు ఆయన్ను వాసుపల్లి రాము(70) గా గుర్తించారు. మరిన్ని వివరాలు తెలుసుకుని, అప్పుఘర్ ఏరియాలో ఉంటున్న వృద్ధుని కుటుంబీకులను రప్పించి వారికి అప్పగించారు.

సుగ్రీవుని భౌగోళిక పరిజ్ఞానం అద్భుతం

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు
- కొనసాగుతున్న రామాయణ ప్రవచనాలు

మధురవాడ: సుగ్రీవుని భౌగోళిక పరిజ్ఞానం ఎంతో అద్భుతమని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. స్వామి హనుమ తన బుద్ధిబలం, వేగం చేత తన ప్రభువు శ్రీరాముడి పూర్తి నమ్మకమును చూరగొన్న మహాత్ముడని కొనియాడారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ రామయణ ప్రవచనాల్లో భాగంగా కిష్కింధకాండలో పలు ఘట్టాలను వివరించారు. సుగ్రీవుని ఆజ్ఞను అనుసరించి ఎంతో బలం కలిగిన కొన్ని కోట్ల కోతులు, కొండముచ్చులు, భల్లూకములు కిష్కింధకు చేరుకోగా, ఆ ప్రాంతం మొత్తం వీటితో నిండిపోయిందని తెలిపారు. సీతాన్వేషణ కొరకు ఎవరెవరు ఏ దిక్కుకు వెళ్లారో వివరించారు.

బాబోయ్.. కోతులు



భీమిలి రోడ్డులోని ఇంట్లో ప్రవేశించిన కోతి

తగరపువలస: భీమిలి రోడ్డులోని పాత ఆంధ్రా బ్యాంకు సమీపంలో రెండు కోతులు స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎక్కడి నుంచో వచ్చిన ఈ కోతులు మూడు రోజులుగా ఇక్కడి ఇళ్లలోకి ప్రవేశించి సామాన్లు చిందరవందరగా పడేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. కోతుల నుంచి ఉపశమనం కల్పించాలని జూ అధికారులతో పాటు జీవీఎంసీకి ఫిర్యాదు చేశారు.

12 ఎకరాలకే ఉప్పు సాగు పరిమితం



మట్టి వేసి తొక్కించిన ఉప్పు మడులు

తగరపువలస: భీమిలి మండలం కొత్త మూలకుద్దులో ఈ ఏడాది ఉప్పు సాగు గణనీయంగా పడిపోయింది. ఇక్కడ తీరప్రాంతంలో ఉప్పు సాగుకు అనుకూలంగా 99 ఎకరాలు ఉండగా ఈ ఏడాది 12 ఎకరాలలోనే కౌలురైతులు సాగుకు ముందుకు వచ్చారు. ఏటా నవంబరు నుంచి జూలై వరకు ఉప్పు సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. కానీ గతేడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కురిసిన అకాల వర్షాలు ఉప్పుసాగును కోలుకోలేని దెబ్బతీశాయి. దీంతో నాలుగు నెలలు ఆలస్యంగా కౌలు రైతులు ఉప్పుమడులు సిద్ధం చేస్తున్నారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో ఎండలు కాయకపోడంతో సాగురైతులు దిగాలుగా ఉన్నారు. రాష్ట్రంలో ఉప్పు సాగు చేసే మిగిలిన ప్రాంతాలైన నౌపడ, రేవు పోలవరం, పూడిమడక, భావనపాడు, మర్రిపాడు, వాడ చీపురుపల్లిల్లో లేని ప్రతికూల పరిస్థితులు భీమిలిలోనే ఉన్నాయని ఇక్కడి రైతులు వాపోతున్నారు. ఉప్పుసాగుకు ఆశించిన స్థాయిలో ఎండలు లేకపోగా రొజ్జ గాలులు పంట దిగుబడిపై ప్రభావం చూపుతాయంటున్నారు. సాగుకు సిద్ధం చేసిన మడులలోకి బుధవారం నుంచి నీరు వదిలినట్లు రైతులు తెలిపారు. సాగుకు వాతావరణం అనుకూలిస్తే వారం రోజుల్లో తొలి దిగుబడి లభిస్తుందన్నారు. సీజన్‌లో నాలుగు నెలలు వృథా కావడంతో పెట్టుబడులు కూడా వస్తాయో, లేదో అని ఆందోళన చెందుతున్నారు.

భారతీయుల పరాక్రమానికి ప్రతీక ఛత్రపతి శివాజీ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి

కొమ్మాది: భారతీయుల పరాక్రమానికి ప్రతీక ఛత్రపతి శివాజీ అని చంద్రంపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి అన్నారు. ఆయన శౌర్యం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్న భాషా ఉత్సవాల్లో భాగంగా బుధవారం పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సాహసం, ధైర్యం, దేశభక్తి అలవరచుకోవాలని సూచించారు. కరెన్సీ నోట్లపై ఉన్న భాషలన్నీ జాతీయ భాషలే అని, అందులో హిందీకి దేశ వ్యాప్తంగా అంతర్జాతీయంగా ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వ్యకృత్వ, పద్య, పఠన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

విద్యార్థుల నివాళులు

తగరపువలస: ఆనందపురం మండలం నీళ్లకుండీల కూడలికి చెందిన శ్రీసాయి స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు శివాజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ పరమత సహనం కలిగిన వీర శివాజీ దేశ వ్యతిరేకులకు సింహస్వప్నం అయ్యాడని వివరించారు.

శివరాత్రికి ఏర్పాట్లు

పీఎం పాలెం: స్థానిక ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులోని శ్రీ శృంగేరీ శంకర మఠంలో శ్రీ ఉమా సిద్ధేశ్వర స్వామి సన్నిధిలో ఈ నెల 26న మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని మఠం గౌరవ పరిపాలనాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆరోజు తెల్లవారుజాము 4 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామి వారికి ఏకవారాభిషేకాలు, రాత్రి 8గంటల నుంచి లింగోద్భవ కాలం వరకు ఏక వార పంచామృతాభిషేకాలు ఉంటాయని తెలియజేశారు. అలాగే కారుషెడ్ కూడలిలోని శ్రీ కాశీ ఉమా మహేశ్వర స్వామి ఆలయంలోనూ మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.